శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## వ్యవసాయానికే అధిక ప్రాధాన్యం : మంత్రి నారాయణ



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర పురపాలక శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు. ముందుగా జడ్పి చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ మంత్రి నారాయణకి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ సమావేశంలో ప్రసంగించారు. రాష్ట్రంలో 62 శాతం ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి ఉన్నారన్నారు. ప్రధానంగా ప్రభుత్వ వ్యవసాయానికే అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చూస్తామని చెప్పారు. పంటల విషయంలో ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. మండల స్థాయిలో జిల్లా అధికారులు పర్యటించాలని సూచించారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలకు సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే ఆయకట్టు స్థిరీకరణ విషయం పై చర్యలు చేపడుతున్నామన్నారు. కాలువల పూడికలు తీయాలని అధికారులను ఆదేశించామని చెప్పారు. త్వరలోనే సోమశిల వద్ద పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

## గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆనంద్ తనిఖీ



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నగరంలోని దర్గామిట్ట వద్ద గల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను శనివారం జిల్లా కలెక్టర్ ఆనంద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, అందిస్తున్న భోజనం మెనూ వివరాలు, వసతి సౌకర్యాలను హెచ్ఎం విజయలక్ష్మిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు పట్టిక, పలు రిజిష్టర్లను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్, విద్యార్థుల నివాస గదులు, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. ఆరవ తరగతి, పదో తరగతి గదిలో విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ వారి అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. రోజు వారి సిలబస్‌తో పాటు విద్యార్థులకు కఠిన విషయ పరిజ్ఞానం ఉండేలా ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. టైం టేబుల్ ప్రకారం తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. వసతి గృహానికి అవసరమైన చిన్న చిన్న రిపేర్లను స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ ద్వారా చేపట్టాలని హెచ్ఎంకు సూచించారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి పరిమళ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## సెంట్రల్ బ్యాంక్ సీఈవోను సన్మానించిన సొసైటీ



**కోవూరు,ఆగస్టు 10 ప్రభాతవార్త :** కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార సొసైటీని శనివారం జిల్లా సహకార బ్యాంక్ సీఈవో ఎస్. శ్రీనివాసరావు ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ప్రస్తుతం ఎంతమేర రైతులకు బంగారం మీద రుణాలు ఇచ్చారు.. ఆదేవిధంగా లాకర్ సదుపాయాన్ని ఎంతమేర రైతులు సద్వినియోగం చేసుకున్నారు అనే విషయాలను సొసైటీ సీఈవో గోవర్ధనరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గోవర్ధనరెడ్డి త్వరలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు సన్నాహాలు చేపడుతున్నామని, ఆదేవిధంగా ఇనమడుగులో ఉన్న గోదాముల అభివృద్ధికి కూడా ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని సీఈవోకు వివరించారు. అనంతరం సెంట్రల్ బ్యాంక్ సీఈవోను పడుగుపాడు సహకార సొసైటీ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, సొసైటీ అధికార సిబ్బంది ఉన్నారు.

## జిల్లా అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా



**నెల్లూరు రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** జిల్లా అభివృద్ధే తొలి ప్రాధాన్యతగా పనిచేస్తామని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన సాధారణ సర్వ సభ్య సమావేశంలో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ప్రాంగణానికి చేరుకున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డికి ఆనం అరుణమ్మ దంపతులు శాలువాతో సత్కరించారు. పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం ప్రారంభమైన సమావేశంలో ఎంపి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువు తీరాక జరిగిన తొలి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు హాజరైన ఈ సమావేశం జిల్లా అభివృద్ధి పథంలో పయనించేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే పార్లమెంట్ సభ్యుడిగా నెల్లూరు జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నానన్నారు. ఎలాంటి సహకారం కావాలన్నా చేసేందుకు తాను ముందుంటానని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించుకోదగిన సమస్యలకు ఇక్కడే పరిష్కారం చూపుతామని ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఒక వేళ ఆ విషయం రాష్ట్రస్థాయిలో లేదా కేంద్రస్థాయిలో పరిష్కరించాల్సి వస్తే తప్పకుండా ఎంపిగా తాను, జిల్లా మంత్రులుగా నారాయణ, ఆనం సహాయ సహకారాలు ఉంటాయన్నారు. జిల్లాకు సంబంధించి కేంద్రస్థాయిలో పరిష్కారం కాగల సమస్యలేవైన తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణ రెడ్డిలతో పాటు కలెక్టర్ ఆనంద్, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, వివిధ శాఖ ముఖ్య అధికారులు హాజరైయ్యారు.

## పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన ఎస్పి



**నెల్లూరు క్రైం, ఆగస్టు 10, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని దర్గామిట్ట, వేదాయపాలెంతో పాటు నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని వెంకటాచలసత్రం, మనుబోలు, కెపి పోర్టు, ముత్తుకూరు పోలీసు స్టేషన్‌లను జిల్లా ఎస్పి కృష్ణకాంత్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్ పరిసరాలను, పోలీసు స్టేషన్స్ మ్యాప్, చార్ట్‌లను, స్టేషన్స్ పరిధిలో ఉన్న హైవే, శాంతి భద్రతల పరిస్థితులను పరిశీలించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పచ్చదనం పెంచాలని, పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. పోలీసు స్టేషన్ సిబ్బంది యోగక్షేమాలు అడిగి, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ద్విచక్రవాహనాలను నడిపే పోలీస్ సిబ్బంది అధికారులు తప్పక హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ కలిగి ఉండాలని బైకుకు కండిషన్‌లో ఉంచుకోవాలని సూచించారు. ప్రాపర్టీ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. శిధిలావస్థలో ఉన్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలని తెలిపారు. దొంగతనం కేసులలో కోల్పోయిన ప్రాపర్టీ రికవరీ పై ప్రత్యేక దృష్టి సారించాలని, హైవే పై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న కేసులలో సత్వరమే దర్యాప్తు పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని, సదరు కేసులలో తగిన సూచనలు సలహాలు చేశారు. ఆయన వెంట టౌన్ డిఎస్పి శ్రీనివాస రెడ్డి, రూరల్ డిఎస్పి శ్రీనివాసరావు, ఎస్‌బిడి ఎస్పి శ్రీనివాసరావు, సంబంధిత పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతులను సన్మానించిన దినేష్‌రెడ్డి



**కోవూరు,ఆగస్టు 10 ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని వారి సతీమణి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలను శనివారం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన వీరిద్దరితో పలు రాజకీయ విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణచైతన్య, ఉన్నారు.

# రసా బసాగా జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం





**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** జిల్లా పరిషత్ సభ్యులందరూ పార్టీలకతీతంగా పని చేసి రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కోరారు. శనివారం నెల్లూరు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంనకు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, శాసన మండలి సభ్యులు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, డివి కృష్ణారెడ్డి, కె. రామకృష్ణ, ఇంటూరి నాగేశ్వర రావు తదితరులు హాజరయ్యారు. తొలుత నూతనంగా ఎన్నికై జడ్పి సమావేశానికి విచ్చేసిన ఎపార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులకు చైర్ పర్సన్ ఆనం అరుణమ్మ పుష్పగుచ్ఛాలతో సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సమావేశంనుద్దేశించి మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్ సమావేశాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు చొరవతో పాల్గొనాలని వారి ప్రాంత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు ఇంకా రెండున్నరేళ్ల పదవీకాలం సమయముందని, దానిని సద్వినియోగం చేసుకొని ప్రజలకు మంచి పరిపాలన అందించాలన్నారు. మండల పరిషత్ సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో, గ్రామ స్థాయిలో జరిగే సమావేశాల ద్వారా సాంకేతికత బదిలీ జరుగుతుందన్నారు. జిల్లాలో 85 శాతం ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, అటువంటి రైతుల సమస్యలపై జడ్పి సమావేశాల్లో ఎలుగెత్తి చాటాల్సిన అవసరం సభ్యులపై ఉందన్నారు. గత ఐదు సంవత్సరాల కాలంలో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు గ్రహణం పట్టిందని, చిన్న చిన్న రిపేర్లకు సైతం నోచుకోకుండా పూర్తి స్థాయిలో నిర్వహణ కొరవడిందన్నారు. అనేక విధాలుగా రైతాంగం నష్టపోయిందన్నారు. అదే విధంగా జిల్లాలోని సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ఆయకట్టును స్థిరీకరిస్తామన్నారు. సోమేశ్వరాలయాన్ని దేవాదాయ శాఖ నిధులతో పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం అనుభవమున్న ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినందున, వ్యవసాయపరంగా రైతులకు అన్ని విధాలుగా మేలు చేసి ఆదుకుంటామన్నారు. కేవలం రవాణా ఖర్చులు వసూలు చేస్తూ, ఇసుకను పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఇసుక ద్వారా వచ్చిన కొద్ది మొత్తమును కూడా స్థానిక సంస్థలకే జమ చేయటం జరుగుతుందన్నారు. అదే విధంగా సభ్యులు లేవనెత్తినట్లుగా బుచ్చిరెడ్డిపాలెంలోని దేవాలయ భూముల్లో జరిగిన అవకతవకలపై విచారణ నిర్వహిస్తామన్నారు. జడ్పి సభ్యులందరూ శాసన సభ్యులతో కలసికట్టుగా పని చేసి తమ తమ ప్రాంతాల అభివృద్ధికి దోహదపడాలన్నారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ సభ్యులు లేవనెత్తిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. జిల్లాలో ఎటువంటి విత్తనాల కొరత, యూరియా కొరత లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా పంట చేతికోచ్చాక అమ్ముకునేందుకు సరైన మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామన్నారు. అదే విధంగా మండల కేంద్రాల్లో అవసరమైన చోట శీతల గిడ్డంగుల నిర్మాణానికి, హార్టికల్చర్ విభాగంలో కొబ్బరిని జోడించుటకు, జిల్లా రైతులు కొబ్బరి పంట సాగు చేసే విధంగా తగు ప్రోత్సాహం అందిస్తామన్నారు. జిల్లాలోని వివిధ పంట కాలువల ఆయకట్టును స్థిరీకరించుటకు చర్యలు తీసుకుంటామన్నారు. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడఉతూ కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న జిల్లాకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుటకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డ మాట్లాడుతూ ఇరిగేషన్ పరంగా సాగు చేస్తున్న పంటల లెక్కలకు ఈ క్రాస్‌లో నమోదు చేస్తున్న పంటల లెక్కలకు వ్యత్యాసముందన్నారు. రైతులకు సంబంధించి గతంలో చేపట్టిన మోసపూరిత చర్యలు వల్ల చిన్న, సన్నకారు రైతులు నష్టపోయారన్నారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాబోయే వ్యవసాయ సీజన్లో రైతులకు విత్తన కొరత లేకుండా చూడాలని, పండిన పంటను మంచి ధరకు అమ్ముకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. మిల్లర్ల పెత్తనాన్ని తగ్గించి, రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పంట కాలువల ఆయకట్టను నూతనంగా స్థిరీకరించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కందుకూరు ప్రాంత ప్రజల జీవనాడి అయినటువంటి రాళ్లపాడు ప్రాజెక్టుకు సరైన నిర్వహణ లేదని, మైనర్ ఇరిగేషన్ కింద మోపాడు చెరువుకు సైతం నిర్వహణ లేదని, వీటిని పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. శాసన మండలి సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి జిల్లాలో ఇటీవల జరిగిన పాఠశాల విద్యా కమిటీ ఎన్నికల నిర్వహణ, నెల్లూరు నగరంలోని కెఎన్ఆర్ పాఠశాలలో ప్రమాదవశాత్తు మరణించిన విద్యార్థి గురించి ప్రశ్నించారు. ఈ సమావేశంలో జడ్పి సీఈఓ కన్నమనాయుడుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# సాగునీరు అందించేందుకు అన్ని ముందస్తు చర్యలు



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త :** జిల్లాలో నీటి పంపిణీ వ్యవస్థను మెరుగుపరచి రైతాంగానికి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పురోగతి, సాగునీటి కాలువల స్థితిగతులపై సోమశిల, తెలుగుగంగ, కండలేరు ప్రాజెక్టుల ఇంజనీరింగ్ అధికారులతో మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, పొంగూరు నారాయణ, కలెక్టర్ ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ సోమశిల జలాశయం రక్షణ కోసం చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదకన చేపట్టాలని సూచించారు. ప్రధానంగా గేట్ల రోప్స్ హెడ్ రెగ్యులేటరీ పనుల మంజూరుకు సంబంధించి మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నారాయణ నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇరిగేషన్, ఆర్థిక శాఖ కార్యదర్శులతో ప్రత్యేకంగా ఫోన్‌లో మాట్లాడి త్వరగా అనుమతులు ఇప్పించాలని కోరారు. సోమశిలకు నీళ్ల వచ్చేలోగా ఆఫ్రాన్ పనులు పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి కాంట్రాక్టర్ చేత పనులు వేగం చేయించాలని సూచించారు. సోమశిల అభివృద్ధి పనులకు సరిపడ ఇసుకను ముందుగానే సిద్ధం చేసుకుని స్టాక్ పాయింట్‌లో అందుబాటులో వుంచుకోవాలని ఆదేశించారు. 18 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం కాగా, ఇందుకు కలెక్టర్ అనుమతి కూడా ఇచ్చారని, ఈ మేరకు ఇసుకను సోమశిలకు తరలించి స్టాక్ పాయింట్‌లో సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే పంటకాలువల్లో పూడికతీత, గుర్రపుడెక్క తొలగింపు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే పనులు మొదటి పెట్టి రైతాంగానికి సాఫీగా సాగునీరం దించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంకా ఏమైనా మిగిలిన పనులను కూడా గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నెలరోజుల లక్ష్యం పెట్టుకుని పూడికతీత పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సారి జిల్లా రైతాంగానికి పుష్కలంగా సాగునీరు అందించేందుకు పక్కాగా నీటి పంపిణీ వ్యవస్థను పక్కాగా అమలు చేయాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు. జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ గతంలో పెన్నానదికి ఐదు లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చిందని, ఆ సమయంలో, వాటిని గుర్తించి కట్టలను ఇసుక బస్తాలు ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో పూడ్చాలని అధికారులను ఆదేశించారు. నెలరోజుల్లోగా పెన్నానది కట్టకు పడిన గండ్లు పూడ్చాలని సూచించారు. కావలి, కందుకూరు వెంకటగిరి ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, సోమశిల, కండలే రు జలాశయాలు, ఇరిగేషన్ ఎస్ఈలు, ఎంవి రమ ణారెడ్డి, కృష్ణమోహన్, డిప్యూటీ కలెక్టర్లు, ప్రేమ్ కుమార్, చిన్న ఓబులేసు, డిఎఫ్‌వో చంద్రశేఖర్, ఆత్మకూరు ఆర్డీవో మధులత తదితరులు పాల్గొన్నారు.

## అధైర్యపడవద్దు అండగవుంట...మేకపాటి



**వరికుంటపాడు,ఆగస్ట్10,ప్రభాతవార్త :** కార్యకర్తలెవ్వరు అధైర్యపడవద్దని తాను అండగ నిలసుస్తానని ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాలరెడ్డి అన్నారు. శనివారం వరికుంటపాడు మండలంలో ఆయన విస్తృత పర్యటన చేశారు. మండలకేంద్రమైన వరికుంటపాడులోని మండల బిసిసెల్ అధ్యక్షుడు పోలుబోయిన మల్లికార్జునయాదవ్ తండ్రి మాలకొండ్రాయుడు ఇటీవల ఆనారోగ్యంతో చికిత్స పొందుతుండగ విషయం తెలుసుకున్న మేకపాటి రాజగోపాలరెడ్డి ఆయన నివాసానికివచ్చి మాలకొండ్రాయుడ్ని పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకొని ధైర్యం చెప్పారు. ఏఅవసరమైన తనను సంప్రదించాలని అన్నారు. ఈసందర్భంగ స్థానిక మండల నేతలు వివిద సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగ ఎవ్వరు ఏవిషయంలో భయపడవద్దని ఎల్లవేళల అందుబాటులో వుంటు తోడుగ నిలుస్తానని హామీఇచ్చారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, మండల బిసిసెల్ అధ్యక్షుడు పోలుబోయిన మల్లికార్జున యాదవ్, నేతలు మాగంటి శ్రీనివాసులు, గుంటుపల్లి రామాంజనేయులు, బొడ్డు వెంకటేశ్వరరెడ్డి, గవదకట్ల మల్లికార్జున, రాయవరపు మధుసుదన్‌రావు, దాసరి ఎర్రవోబయ్య, చెన్నారాయుడు, నేలటూరి నాగరాజు, రేగలగడ్డ బంగారుబాబు, తిరుపతిరెడ్డి, మాలకొండయ్య, మాలకొండ్రావు, చెనిగల నాగప్రసాద్, కె నాని, నరసిం హ, సర్పంచ్‌లు కుమిత ప్రతాప్‌రెడ్డి, శేషం నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం కాదు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుంది

## సర్వేపల్లిలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శనలో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**పొదలకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త :** భారత రాజ్యాంగం కాదు, రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండల కేంద్రంలోని మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి కొవ్వొత్తుల ప్రదర్శనలో మాజీ మంత్రి డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పై దాడికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరిట నిర్మించిన అంబేద్కర్ స్మృతి వనాన్ని భారత జాతి గర్వించే విధంగా ప్రసిద్ధ పర్యటన క్షేత్రంగా రూపొందించి జనవరి 19న 2024వ సంవత్సరం నాడు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. చంద్రబాబు అమరావతిలో అంబేద్కర్ భారీ విగ్రహం ఏర్పాటు చేస్తానని బీరాలు పలికి, ఎక్కడో మారుమూల స్థలం కేటాయించినట్లు ప్రకటించి, అంబేద్కర్ అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేశారు. జగన్మోహన్ రెడ్డి విజయవాడ నడిబొడ్డున అత్యంత ఖరీదైన స్థలాన్ని ఎంపిక చేసి 404 కోట్లతో అంబేద్కర్ భారీ విగ్రహంతో పాటు, అంబేద్కర్ గారి స్మృతి వనాన్ని ఏర్పాటు చేశారు. విజయవాడ నడిబొడ్డున మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని చూసి చంద్రబాబు అండ్ కో తట్టుకోలేకపోతున్నారన్నారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసానికి తరలివచ్చిన ద్రోహులకు, అందర్ని బయటికి పంపించి, లైట్లు ఆర్పేసి, పోలీసులే సహకరించడం దౌర్భాగ్యమన్నారు. సామాజిక న్యాయ మహాశిల్పం ప్రారంభించిన నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేరు ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుండి రాష్ట్రంలో పచ్చ గ్యాంగ్ రెచ్చిపోతూ, పేదలపైన సామాన్యులపైన, అమాయకులపైన దాడులు చేస్తూ, ఆస్తులు, ప్రాణాలు హరిస్తూ, చిరవకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం పై దాడికి పాల్పడడం వారి దఉందుడగు చర్యలకు పరాకాష్ట అన్నారు. మహనీయుడు డా. బిఆర్ అంబేద్కర్ మీద ప్రేమాభిమానాలతో సామాజిక న్యాయ మహాసభపై జరిగిన దాడిని ఖండిస్తూ, పెద్ద ఎత్తున విచ్చేసిన వైఎస్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ సంఘాల నాయకులు, అంబేద్కర్ అభిమానులు అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## పాము కాటుకుగరై గిరిజన విద్యార్ది మృతి



**జలదంకి, ఆగష్ట్10, ప్రభాతవార్త:** బహిర్భూమికి వెళ్ళి విషసర్పం కాటువేయడంతో గిరిజన విద్యార్ది మృతి చెందిన సంఘటన ఆకుటుంభాన్ని దుఃఖసాగరంలో ముంచింది. ఈవిషాదకర ఘటన జలదంకి మండలం తిమ్మసముద్రంలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబందించి గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కాలనీకి చెందిన తలపల మాల్యాద్రి, వెంకటరమణమ్మల కుమారుడు దుర్గాప్రసాద్(13) ఉదయం పూట బహిర్భూమికి వెళ్ళి పాము కాటువేయడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న తల్లి దండ్రులు, కాలనీ వాసులు పరుగునవెళ్ళి పరిశీలించారు. వైద్యం నిమిత్తం కావలికి తరలిస్తుండగ మార్గమద్యంలో మృత్యువాత పడ్డాడు. దీంతో మృతదేహాన్ని వెనక్కు తీసుకెళ్ళారు. కొద్ది సమయంలోనే జరిగిన బాలుని విషాదాంతం గ్రామంలో అందరిని కంట తడి పెట్టించింది. విషయం తెలుసుకున్న టిపిడిపినేత మండలమాజీ ఉపాధ్యక్షుడు తల్లపనేని మధుసూదన్‌రావు, మండలపార్టీ ఉపాధ్యక్షుడు కంచర్ల వినోద్, తదితర పార్టీ శ్రేణులు మాల్యాద్రి నివాసానికి వెళ్ళిపరామర్శించారు. కుటుంభ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాలుడు అకాల మృతిపై సంతాపం వ్యక్తంచేశారు. నిరుపేద గిరిజన కుటుంబానిప్రభుత్వం ఆదుకోవాలని అలాగే దాతలు కనికరించి సాయమందించాలని విజ్ఞప్తిచేశారు. కాగా బాలుడు స్థానిక ప్రాదమిక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు.

## ఎమ్మెల్యే కావ్య క్రిష్ణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన 1వ పట్టణ సిఐ ఫిరోజ్



**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కావలి ఒకటవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎండి. ఫిరోజ్ కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూలబొకెను అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా వీరు పలువిషయాలను చర్చించుకోవడం జరిగింది.

## కంప్యూటీకరణ పూర్తయితే పారదర్శకత వస్తుంది



**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** జిల్లాలోని ప్రాథమిక సహకార సొసైటీలకు సంబంధించి కంప్యూటీకరణ కార్యక్రమం జరుగుతుందని, అక్టోబర్ 2 లోగా పూర్తి అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ బ్యాంక్ సీఈవో శ్రీనివాసరావు అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు ప్రాథమిక సహకార సొసైటీని శనివారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటివరకు ఎంతమేర కంప్యూటీకరణ జరిగింది అనే విషయాలను నిశిత పరిశీలన చేపట్టారు. జిల్లాలో తొలివిడతగా పైలెట్ ప్రాజెక్టు కింద కోవూరు మండలంలోని పడుగుపాడు సహకార సొసైటీ, తోటపల్లిగూడూరు మండలంలోని పేడూరు సొసైటీని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు ఈ రెండు సొసైటీల్లో కంప్యూటీకరణ కార్యక్రమం కొంతమేర పూర్తికావడం జరిగిందన్నారు. నెట్ సక్రమంగా పనిచేయకపోవడంతో ఆశించిన మేర పూర్తి కాలేదన్నారు. మొత్తం ఈ కంప్యూటీకరణ పూర్తయితే సొసైటీలో కార్యకలాపాల్లో పూర్తిస్థాయిలో పారదర్శకత ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోఆపరేటివ్ సబ్ రిజిస్ట్రార్‌లు సుబ్బరామిరెడ్డి, శివ, సూపర్‌వైజర్‌లు సురేష్‌రెడ్డి, కె. రమేష్, తదితరులు ఉన్నారు.

## వ్యక్తిగత పరిశుభ్రత విద్యార్థులకు అవసరం




**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఇనమడుగు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ నిరంజన్ అన్నారు. కోవూరులోని సాంఘిక సంక్షేమ, బీసీ బాలబాలికల వసతి గృహ సముదాయంలో శనివారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బయట రోడ్లపై ఉండే తినుబండారాలు, చిరుతిండ్ల జోలికి వెళ్లరాదన్నారు. టిఫిన్ చేసే ముందు, భోజనం చేసే ముందు చేతులను పరిశుభ్రంగా ఒకటికి రెండు సార్లు కడుక్కోవాలన్నారు. అదేవిధంగా మల మూత్ర విసర్జనకు వెళ్లిన తర్వాత కూడా ఇదే పద్ధతిలో చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చేతులు అపరిశుభ్రంగా ఉన్న కారణంగానే వసతి గృహంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు వివిధ రకాల వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. సంక్షేమాధికారులు కూడా ప్రస్తుత సీజన్‌లో మంచినీటిని కాచి ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ కృష్ణమ్మ, సంక్షేమాధికారులు వెంకట్రావు, పద్మ, మేరీ సుప్రజ, పద్మావతి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**మర్రిపాడు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** మర్రిపాడు మండలంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మర్రిపాడు యుటిఎఫ్ భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కుటుంబ సంక్షేమ సంఘ డైరెక్టర్ ఎస్. కె. నాయబ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల సాధనే ధ్యేయంగా యుటిఎఫ్ పోరాటం కానగిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. సుధాకర్, నాయకులు పి. గురుస్వామి, కె. బాలగురవయ్య, ఎన్. వెంకటేశ్వర్లు, జి. వెంకటేశ్వర్లు, ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, మహ్మద్ గౌస్ భవన నిర్మాణ కార్యదర్శి డి. జాన్సన్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చెన్నకేశవులుకు నివాళులర్పించిన జూపల్లి



**వింజమూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** వింజమూరు పంచాయతీ పరిధిలోని జైభీంనగర్ కాలనీకి చెందిన మంచా చెన్నకేశవులు శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వింజమూరు సొసైటీ మాజీ చైర్మెన్ జూపల్లి రాజారావ్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్లసురేష్ బావమరిది సాంబయ్యలు చెన్నకేశవులు నివాసానికి వెళ్ళి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. చెన్నకేశవులు కుటుంబానికి తెలుగుదేశంపార్టీ అండగా ఉంటుందన్నారు.

## ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో పారదర్శకత




**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీల అభివృద్ధికి గానూ కేంద్రం ప్రభుత్వం విడుదల చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో సంబంధిత గ్రామ సర్పంచ్‌లు పారదర్శకంగా వ్యవహరించాల్సి ఉంటుందని సిర్డ్ ఏడీ రాజ్యలక్ష్మి అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశంలో జరుగుతున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల శిక్షణా శిబిరం ముగింపు సమావేశంలో శనివారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంచాయతీ ఆదాయాన్ని మరింత పెంచేలా పాలకవర్గాలు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఆర్థిక సంఘం నిధులను ఏయే విభాగాలకు ఎంతమేర ఖర్చు పెట్టాలి అనే విషయాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. మంచినీరు, పరిశుభ్రత , నూతన వాహనాల కొనుగోళ్ల తదితర విషయాలపై ప్రాధాన్యత క్రమంలో ఖర్చు పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి పథంలో పయనించేలా దృష్టి పెట్టాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీరామాంజనేయులు, ఈవోపీఆర్డీ నాగూర్‌వలిలు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు , పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీపార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో శనివారం పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామివారికి అభిషేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్నిభక్తమండలి ఆధ్వర్యంలో కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అక్రమణదారులకు శాఖాపరమైన చర్యలు తప్పవు




**ఉదయగిరి, ఆగష్టు 10, ప్రభాతవార్త:** ఉదయగిరి మండలం కొండయ పాలెం గ్రామపంచాయతీలో గల సర్వే నంబర్లు 1284 లో గత రెంబు రోజుల క్రితం అక్రమంగా జామాయిల్ నరికిన ఘటనలో ఉదయగిరి రెవెనూ శాఖ అధికారులు సంబంధిత వ్యక్తుల నుండి అక్రమంగా తరలించడానికి సిద్దంగా ఉన్న లారీని జామాయిల్ కర్రలను స్వాధీనం చేసుకొని ఉదయగిరి తాసిల్దార్ ఎం సుభద్ర ఆదేశాల మేరకు పోలీసు శాఖకు మరియు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కు తెలియపరిచినట్లు తెలియజేశారు. ఉదయగిరి ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ అక్రమంగా నరికిన జామాయిల్ కర్రలను అటవీ శాఖ అధికారులకు క్ర యొక్క విలువ కొరకు నివేదికలు కోరినట్లు తెలిపారు. కర్ర తరలింపుకు ఉపయోగించిన లారీ ఉదయగిరి పోలీసు శాఖ ఆధీనంలో ఉందని శనివారం ఆదివారం సెలవు దినాలు కావడంతో ఫారెస్ట్ డిపార్ట్మెంట్ నుండి నివేదిక రావాడానికి ఆలస్యం అయిన కారణంగా సోమవారం నాడు కర్ర విలువ యొక్క నివేదికలను లారీని ఉదయగిరి కోర్టు వారికి అప్పగిస్తామని అన్నారు. ఈ విషయమై తమ ఉన్నత అధికారులైన డి.ఎస్.పి గారికి తెలియపరచామని సంబంధిత వ్యక్తుల మీద కేసులు నమోదు చేసి కోర్టుకు అప్పజెప్తామని అన్నారు. సోషల్ మీడియాలో కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అలాంటి చర్యల వలన ప్రజల్లోకి సంకేతాలు తప్పుగా వెళ్లే ప్రమాదం ఉందని సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయొద్దని ఆయన తెలిపారు. ఈ కేసు విషయంలో ఎలాంటి వ్యక్తులు ఉన్న ఉపేక్షించే ప్రసక్తే లేదని సీఐ గిరిబాబు ఆదేశాల మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ




**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** సంయుక్తసేవాసంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో కావలి పట్టణం వాయునందనప్రెస్‌రోడ్డులో నివాసముంటున్న కె. సాయిసునీల్ అక్క కె. సుష్మ పుట్టినరోజు సందర్భంగా శనివారం కావలి పట్టణం బుడమగుంట నక్కలోళ్ల కాలనీలోని పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అద్యక్షులు గంగపట్నం సురేంద్ర మాట్లాడారు. సుష్మ పుట్టినరోజు సందర్భంగా సంయుక్తసేవాసంస్థ ద్వారా పేదలకు భోజనం ప్యాకెట్లు వితరణ చేయించిన దాత సాయిసునీల్‌కు ధన్యవాదాలు తెలియచేశారు. పుట్టినరోజు జరుపుకుంటున్న సుష్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియచేశారు.

## ఉచిత వైద్య శిబిరాలు నేడు

**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కోవూరులోని జాతీయ రహదారిలో ఉన్న చౌదరి పెట్రోల్ బంక్ సమావేశ మందిరంలో , సుధీర్ ఆస్పత్రి , గౌతమ్ ఆర్థోపెడిక్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని చౌదరి బ్రదర్స్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ ఈ శిబిరంలో బీపీ, షుగర్, పక్షవాతం, మూర్ఛవ్యాధితో పాటు కీళ్లనొప్పులు, నడుం నొప్పి, ఎముకలకు సంబంధించిన పలు విషయాలపై ఈ శిబిరంలో సేవలు అందించడం జరుగుతుందని , కోవూరు మండల ప్రజానీకం ఈ సేవలను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.

## విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి



**వింజమూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో ఈనెల 13న జరిగే ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్ మాదిగ పేర్కొన్నారు. శనివారం వింజమూరులోని ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఎంఎస్‌పి సీనియన్ నాయకులు బెజవాడబాలగురవయ్య అధ్యక్షతన ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో అంబేద్కర్ మాదిగ మాట్లాడుతూ సుప్రీంకోర్టులో ఎస్సీ వర్గీకరణపై సానుకూల తీర్పు రావడంతో మాదిగల ఆత్మగౌరవం పెంపొందేలా ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు. గత 30సంవత్సరాలుగా పోరాట యోధుడుగా నిలిచిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఉద్యమం నడిపిన తీరే ఈ విజయానికి నాంది అన్నారు. విజయం సాధించి ఢిల్లీ గద్ద నుండి తెలుగు నేలకు వస్తున్న మంద కృష్ణమాదిగకు విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమానికి వేలాదిగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పి నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో వై. రమణయ్య, వి. మోహన్‌రావ్, మందా సుజాత, గంగపట్ల సింహాద్రి, నందిపోగు వెంగళరావ్, బి. వెంగళరావ్, సురేష్, పెంచలయ్య, మురళి, రాకేష్, వెంగళరావ్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీమల్లి మిల్క్ అండ్ మిల్క్‌ప్రోడక్ట్సును ప్రారంబించిన మంత్రి ఆనం



**సంగం ఆగష్టు 10 ప్రభాతవార్త :** సంగం మండలం సిద్దీపురం సమీపంలో శ్రీమల్లి మిల్క్ అండ్ మిల్క్ ప్రోడక్ట్సును దేవాదాయ శాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి శనివారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్బంగా యజమాని నేలకుర్తి మల్లికార్జున నాయుడ్ని మంత్రి అభినందించారు. ఈ సందర్బంగా మంత్రి మాట్లాడుతు ఇటువంటి చిన్న చిన్న పరిశ్రమలు రావడం వల్ల ఉపాధీ అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని అన్నారు. ఇటువంటి చిన్న పరిశ్రమలకు ప్రభుత్వం కూడా సహాయసహాకారాలు అందిస్తుందని తెలిపారు. శ్రీమల్లి మిల్క్ ప్రోడెక్ట్సును బాగా అభివృద్ధి చేయమని మల్లికార్జుననాయుడికి ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో సంగం మండలం తెలుగుదేశం నాయకులు మండల పార్టీ అద్యక్షులు గుళ్ళపల్లి శ్రీనివాస్‌యాదవ్, తెలుగుదేశంనాయకులు వెంగారెడ్డిపాళెం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి, సీనియర్‌నాయకులు సూరా శ్రీనివాసులురెడ్డి, టిడిపి జిల్లా నాయకులు బాణా శ్రీనివాసులురెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం టిడిపి యూత్‌నాయకులు వింజం మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని బిక్షగాడు మృతి

**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని యాభై నుంచి యభైఐదు సంవత్సరాల మధ్య వయసు ఉన్న వ్యక్తి మృతిచెందడం జరిగింది. కావలి రూరల్‌పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కావలి రూరల్ మండలం చెన్నాయపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై స్పైసిహబ్ వద్ద శుక్రవారం అర్థరాత్రి ఊరు, పేరు, అడ్రస్ వివరాలు తెలియని బిక్షగాడిని ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొని బలమైన రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామ విఆర్ఎ పరుసు నాగభూషణం ఫిర్యాదు మేరకు కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## రాయితీతో పశువులకు గోకులం షెడ్లు



**ఇందుకూరుపేట, ఆగస్టు 10, ప్రభాతవార్త :** 90శాతం రాయితీతో పాడిపశువుల గోగులం షెడ్లు, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి. మురళీకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఇందుకూరుపేటలో మండలానికి 50 షెడ్లు, తోటపల్లిగూడూరు మండలానికి 50 షెడ్లు మంజూరు చేశారు. పాడి రైతులకు 90శాతం రాయితీతో మినీ గోకులం షెడ్లు మంజూరు చేయబడ్డాయి. పశువులు షెడ్లు నిర్మించుకునే రైతులకు రెండు పశువులకు రూ.115000 రైతు వాటా రూ.11500 నాలుగు పశువులకు రూ.1,85,000 రైతు వాటా రూ.18,500 ఆరు పశువులకు రూ.2,30,000 రైతు వాటా రూ.23 వేలు 90శాతం సబ్సిడీ ఉపాధి హామీ నిధుల నుండి మంజూరు చేస్తారు. గోకులం షెడ్లు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, జాబ్ కార్డు, ఉపాధి హామీ కార్డు, స్థలం డాక్యుమెంటు, బ్యాంకు పాస్ బుక్ ఇవన్నీ తసుకునేసి స్థానిక రైతు సేవా కేంద్రాలు గాని, పశు వైద్యశాలను గాని సంప్రదిస్తే వాళ్ల అప్లికేషన్ ఫీల్ అప్ చేసి పైకి పంపుతారు. రైతులు ఎస్సీ, ఎస్టీ ఇతర బీపీఎల్ ఫ్యామిలీస్ చిన్న సన్న కారు రైతులు అందరూ అర్హులు. గొర్రెల షెడ్లు కోళ్ల షెడ్లు నిర్మించుకునే రైతులకు 70శాతం సబ్సిడీతో షెడ్లు మంజూరు చేస్తారు. 20 గొర్రెలకు 1,30,000 రైతు వాటా రూ.39,000, 50 గొర్రెలకు రూ.2,30,000 రైతు వాటా రూ.6900, రూ.87000 రైతు వాటా రూ.26,100, రూ.1,32,000 రైతు వాటా రూ.39,600 ఆసక్తి ఉన్న రైతులకు అన్ని అర్హతలు ఉంటే షెడ్లు మంజూరు చేస్తారు. అందరికి ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలి. ఈ అవకాశాన్ని కావాల్సిన రైతులందరూ వినియోగించుకోవాలని డాక్టర్ బి. మురళీకృష్ణ కోరారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు చిత్రపటాలు పంపిణీ



**వింజమూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** వింజమూరు మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో , సచివాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చిత్రపటాలను ఉంచాలని తెలుగుదేశంపార్టీ నేతలు పేర్కొన్నారు. శనివారం వింజమూరు మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులురెడ్డికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలను వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావులు తమ సొంత నిధులతో ఏర్పాటు చేయగా మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి అందజేశారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సహకరిస్తు అభివృద్ధిపథంలో నడిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు, చల్లా శ్రీనివాసులు, కొండపల్లి వెంకటేశ్వర్లు, గణపం సుదర్శన్‌రెడ్డి, వనిపెంట హైమావతి, పాములపాటి మాల్యాద్రి, గురజాల వాసునాయుడు, కోడూరు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** గుర్తుతెలియని వాహనం ఢీకొని నలభై నుంచి నలభైఐదు సంవత్సరాల మధ్య వయసు ఉన్న వ్యక్తి మృతిచెందడం జరిగింది. కావలి రూరల్‌పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కావలి రూరల్ మండలం చెంచుగానిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం అర్థరాత్రి ఊరు, పేరు, అడ్రస్ వివరాలు తెలియని బిక్షగాడిని ఏదో గుర్తుతెలియని వాహనం ఢీకొని బలమైన రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. కావలి రూరల్ మండలం ముసునూరు విఆర్ఒ ఆర్. శింగరయ్య ఫిర్యాదు మేరకు కావలి రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కె. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా యుటియఫ్ స్వర్ణోత్సవాలు




**కావలి రూరల్, ఆగస్టు 10 ప్రభాతవార్త :** ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటియఫ్) యాభై వసంతాలు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా కావలి పట్టణంలోని యుటియఫ్ కావలి ప్రాంతీయ మండల శాఖ కార్యాలయంనందు యుటియఫ్ స్వర్ణోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా యుటియఫ్ జెండాను ఆవిష్కరించడం జరిగింది. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలి నిర్వహించడం జరిగింది. ఈ బైక్‌ర్యాలి పట్టణ ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పలువురు యుటియఫ్ నాయకులు యుటియఫ్ ఆవిర్భావ దినోత్సవ విశిష్టతను గురించి తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యుటియఫ్ జిల్లా కార్యదర్శి బెల్లంకొండ మాధవ, రాష్ట్ర ఆడిట్ మెంబర్ బి. శ్రీదేవి, కావలి తాలూకా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల రమణయ్య, కావలి రూరల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జి. వేణు, ముజీబ్ మరియు కావలి పట్టణ, మండల యుటియఫ్ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవి లక్షకుంకుమార్చన పూజలకు భక్తులు తరలిరావాలి




**కావలి, ఆగస్టు 10 ప్రభాతవార్త** వరలక్ష్మీవ్రతం సందర్భంగా కావలి రూరల్ మండలం రాజువారి చింతల పాలెం గ్రామంలో ఈ నెల 16వ తేది శుక్రవావరం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న లక్ష్మీదేవి లక్షకుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నందున భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని శ్రీశ్రీశ్రీ విజయ దుర్గ ఆస్థానపీఠం శాశ్వత ధర్మకర్త శిల్పి వాస్తుసిద్ధాంతి శ్రీ పత్రి వీరబ్రహ్మయ్యస్వామి పిలుపునివ్వడం జరిగింది. కావలి రైల్వేరోడ్డులోని జర్నలిస్టుక్లబ్ నందు శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీ పత్రి వీరబ్రహ్మయ్యస్వామి మాట్లాడారు. శ్రావణమాసంలో విశిష్టంగా వరలక్ష్మీవ్రతం జరుపుకోవడం జరుగుతుందని దీనిని పురస్కరించుకుని గత 30 సంవత్సరాలుగా కావలి మండలం రాజువారిచింతలపాలెంలోని శ్రీశ్రీశ్రీ విజయదుర్గ ఆస్థాన పీఠం నందు లక్షకుంకుమార్చన పూజలు నిర్వహిస్తున్నామని తెలియచేశారు. దీనిలో భాగంగా ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహిస్తున్నామని తెలియచేశారు. ఈ పూజాకార్యక్రమాలకు కావలిపట్టణ మరియు పరిసర ప్రాంత భక్తులు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు అందరికి ఇవ్వబడునని తెలియచేశారు. వీటివలన స్త్రీమూర్తులు దీర్ఘసుమంగళిభవగా ఉండాలని పురుషులంతా ఆయురారోగ్యాలతో ఉండాలని లోకకళ్యాణార్థం కొరకై ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. పూజలో కూర్చునే భక్తులకు పూజాసామాగ్రి ఆలయ కమిటివారే ఉచితంగా అందచేస్తారని తెలిపారు. వచ్చే భక్తులందరికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలియచేశారు. ఈ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణరెడ్డి హాజరు అవుతారని ఆయన విజయదుర్గ ఆస్థానపీఠం నిర్మించే దగ్గరనుండి ఆయన సహాయసహకారాలు అందిస్తున్నారని తెలియచేశారు. విజయదుర్గ ఆస్థానపీఠం ఆలయ ఛైర్మన్ వేముల చెన్నకేశవనాయుడు సహాయసహకారాలందిస్తూ కుంకుమార్చన పూజలో పాల్గొంటున్నాడని తెలియచేశారు. ఈ పూజాకార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలయ కమిటి ట్రెజరర్ చంద్రమౌళి, భక్తులు రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## దేశ భవిష్యత్తు యువత ప్రవర్తనపైనే ఆధారపడి ఉంది



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త** మత్తు పదార్థాలకు బలి కాకుండా యువత జాగ్రత్త పడాలని, దేశ భవిష్యత్తు అంతా యువత మీదే ఆధారపడి ఉన్నందున, సామాజిక దృక్పథంతో, అవగాహనతో యువత నడుచుకోవాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వవిజయ భాస్కర రావు విద్యార్థినులను ఉద్భోవించారు. నెల్లూరులోని దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, మత్తు పదార్థ రహిత భారతదేశాన్ని నిర్మిస్తామని విద్యార్థినులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. నెల్లూరు జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి, నాషా ముక్త భారత అభియాన్ జిల్లా సభ్యులు సెక్రెటరీ అయిన వై. వెంకటయ్య మాట్లాడుతూ వికసిత్ భారత్ కా మంత్ర, భారత్ హోనాషే సే స్వతంత్ర అన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మత్తు పదార్థాల వినియోగం పై నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థినులు అవగాహన పెంచుకొని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్, ఇంటర్మీడియట్ బోర్డ్ నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డా. ఏ. శ్రీనివాసులు ప్రసంగిస్తూ కళాశాలలో జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ అల్లంఉదయ్ శంకర్, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు జి. కరుణ కుమారి, బి. ప్రసన్న, టి. భారతిలతో బాటు లెక్చరర్లు రవీంద్రనాథ్, రమణారెడ్డి, వెంకట్రావు, శ్రీధర్, పూర్ణచంద్ర కుమారి, కృష్ణతులసి, సుధారాణి, శివయ్యలతో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపిడిఒ రాజ్యలక్ష్మీని ఘనంగా సన్మానించిన ఎంపిడిఒ సిబ్బంది



**బుచ్చి ఆగస్టు 10 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒ రాజ్యలక్ష్మీ బదలీపైన సొంత జిల్లాకు వెళుతున్న సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయం సూపరెండెంట్ మంజులమ్మ, ఇఒపిఆర్‌డి రాం మోహన్, కార్యదర్శులు నారాయణరావు, శ్రీనివాసులు రెడ్డి, మల్లికార్జున రెడ్డి సిబ్బందిని ఆమెను ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను కొని యాడారు. ఎన్నికల నేపద్యంలో బుచ్చిరెడ్డిపాళెం ఎంపిడిఒగా వచ్చిన ఆమె జిల్లా స్థాయి అధికారులు మనన్నలు పొంది సొంత జిల్లాకు వెళుతున్న సందర్బంగా ఆమెను సన్మానించారు. సిబ్బంది పాల్గోన్నారు.

## ఎమ్మెల్యే చొరవతో విద్యుత్ స్తంభం ఏర్పాటు



**కలువాయి ఆగస్టు 10 ప్రభాతవార్త** మండల కేంద్రమైన కలువాయిలోని బస్టాండ్ సెంటర్ నందు ప్రధాన రహదారిపై అధిక లోడుతో వెళుతున్న వాహనాలు విద్యుత్ తీగలు తగిలి తరచు ఇబ్బంది జరుగుతున్న సంఘటనపై జనసేన నాయకులు ఈ సమస్యపై మండల కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కార దిశగా శనివారం నూతన విద్యుత్ స్తంబాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు స్థానిక ప్రజలు జనసేన నాయకులు చేసిన కృషికి హర్షం వ్యక్తం చేశారు.

## పోలీసు స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

**మనుబోలు, ఆగస్టు 10, ప్రభాతవార్త** మనుబోలు పోలీసు స్టేషన్‌ను శనివారం మధ్యాహ్నం జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్‌కు రాగానే పోలీసు స్టేషన్‌కు ఇరువైపులా ఎస్పీ కలియ తిరిగారు. అనంతరం ఎస్పీకి సీఐ రాంబాబు, ఎస్సై అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గౌరవ వందనం చేశారు. నిమిషాల వ్యవధిలోనే ఎస్పీ సీఐ, ఎస్సైకి సలహాలు, సూచనలు ఇచ్చి ముత్తుకూరు మండలం కృష్ణపట్నం పోర్టుకు వెళ్లారు. అనంతరం సీఐ రాంబాబు, ఎస్సై అజయ్‌కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్‌లో క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని, నేరాలు, దొంగతనాలు అరికట్టడానికి బీట్లు పెంచాలని ఎస్పీ సూచించారని సీఐ తెలిపారు. అలాగే జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన కౌన్సెలింగ్ చేపట్టాలని తెలిపారని చెప్పారు.

## విజయ డెయిరీ చైర్మన్‌గా పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డి



**మనుబోలు, ఆగస్టు 10, ప్రభాతవార్త** మనుబోలు ప్రభుత్వ విజయ డెయిరీ అధ్యక్షులుగా పచ్చిపాల శ్రీకాంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇక్కడ శనివారం ఎన్నికలు నిర్వహించారు. విజయ డెయిరీలో 10మంది డైరక్టర్లు శ్రీకాంత్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం విశేషం. శ్రీకాంత్‌రెడ్డి విజయ డెయిరీ అధ్యక్షుడిగా డెయిరీ పురోగతికి, అభివృద్ధికి పాల్పడతాడని తెలుగుదేశం పార్టీ తిరుపతిపార్లమెంట్ కార్యదర్శి పచ్చిపాల రామిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాయపాటి కిరణ్‌కుమార్, తెలుగు దేశం పార్టీ నాయకులు కలికి రమేష్‌రెడ్డి ఆకాంక్షించారు. మనుబోలు మండలంలో విద్యకమిటీ చైర్మన్‌లు, పాలడెయిరీ అధ్యక్ష పదవులు తెలుగుదేశం పార్టీ కైవసం అయ్యాయని తెలిపారు.

# అక్రమ మసీదు కట్టడాన్ని వెంటనే నిలిపివేయాలి




**నెల్లూరు వైద్యం, ఆగస్టు 10, ప్రభాతవార్త:** నెల్లూరు నగరంలోని బిజెపి పార్టీ కార్యాలయంలో శనివారము ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ కొత్తూరు, 31వ డివిజన్, రామకోటయ్య నగర్, సుజాతమ్మ పౌల్ట్రీ కాంప్లెక్స్ లో నిమ్మిస్తున్న అక్రమ మసీదు కట్టడాన్ని వెంటనే నిలిపివేయాలని ఆంజనేయ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల కోసం కేటాయించిన సుమారు 120 అంకణాల 10 కోట్లు విలువు చేసే భూమిని ఆక్రమించి కట్టడం ఎంతవరకు సమంజసము అని ఆయన ప్రశ్నించారు. సొంత భూమి లేదా ఎవరైనా భూమిని దానం చేస్తే మసీదు కట్టుకోవచ్చని మసీదు కట్టడానికి మేము వ్యతిరేకం కాదన్నారు. దీని గురించి కలెక్టర్ గారికి కూడా ఫిర్యాదు చేశామని కలెక్టర్ కూడా అక్రమ మసీదు కట్టడానికి వీలు లేదని చెప్పారన్నారు. అనంతరం వైసీపీ పార్టీ రోజురోజుకీ బురదలో కురుకుపోతుందని, ఇక భవిష్యత్తులో ఆ పార్టీ మనుగడ సాగించలేదని, మాజీమంత్రి రోజా కూడా త్వరలో పార్టీ మారబోతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కి విజ్ఞప్తి చేస్తూ జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేయవద్దని విన్నవించారు. అనంతరం బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ నిన్న జరిగిందని, ప్రజలనుంచి, పార్టీల నుంచి వచ్చిన అర్జీలను తీసుకొని త్వరిత గతిన పరిష్కరిస్తానని, ఆయన హామీ ఇవ్వడం జరిగిందన్నారు అలాగనే నెల్లూరులో కూడా ఈఎస్ఐ హాస్పిటల్ ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాని కార్యదర్శి యరబోలు రాజేష్, జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ కుమార్, ఓబీసీ మొర్చ జోనల్ ఇంచార్జ్ ముక్కు రాదాకృష్ణ గౌడ్, ఓబీసీ మొర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గిరి కుమార్ గౌడ్, బీజెవైఎం తిరుపతి జిల్లా ఇన్చార్జ్ లెక్కల రాజశేఖర్ రెడ్డి, స్టేట్ లీగల్ సెల్ మెంబర్ దాసరి రాజేంద్రప్రసాద్, హజరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకు ఘన సన్మానం



**కోవూరు, ఆగస్టు 10 ప్రభాతవార్త :** కోవూరు ఎంపీడీవోగా ఆరు నెలల పాటు సేవలు అందించి ఎన్నికల బదిలీల్లో భాగంగా తిరిగి బాపట్ల జిల్లాకు బదిలీ అయిన శ్రీరామాంజనేయులును శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో కోవూరు మండలం గ్రామ పంచాయతీ కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ఆరునెలల పాటు విధి నిర్వహణలో భాగంగా తమకు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. అటువంటి వ్యక్తి బదిలీ కావడం బాధగా ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు తప్పవని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ఈ ఆరు నెలల పాటు అన్ని శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తమకెంతో సేవలు అందించారని, వాటిని ఎప్పుడూ గుర్తుంచుకుంటానన్నారు. అనంతరం ఎంపీడీవోను శాలువా, పుష్పమాల, మెమెంటోతో సత్కరించారు. ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## ఘనంగా అదానీ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు



**ముత్తుకూరు, ఆగస్టు 10, ప్రభాతవార్త** అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్, అదానీ ఫౌండేషన్ 28వ అదానీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పోర్ట్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. యువకులు, మహిళలు, పిల్లలతో సహా 300 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు పరిధిలోని 19 మత్స్యకారుల సంఘాలుతో పాటు పోర్ట్ పరిధిలోని 32 గ్రామాల్లో ఆదానీ ఫౌండేషన్ పని చేస్తోంది. అదానీ పౌండేషన్ కమ్యూనిటీ ప్రభుత్వ భాగస్వామ్యంతో పనిచేస్తుంది. ప్రభుత్వం పాఠశాలలో విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, తాగునీరు, గ్రామ పరిశుభ్రత, మహిళా సాధికారత, కమ్యూనిటీ ప్లాంటేషన్ అభివృద్ధిలో కీలకమైన అంశాలు, ఇందులో అదానీ ఫౌండేషన్ సిఎస్ఆర్ ప్రాజెక్టులను అమలు చేస్తుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఈవో జీజే రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజనరీ బిజిసెస్ లీడర్ గౌతమ్ భాయ్, అదాని పౌండేషన్ చైర్ పర్సన్ డా. ప్రీతి జి అదానీ నేతృత్వంలో మేము కృష్ణపట్నం సైట్‌లో భాగస్వామ్య కమ్యూనిటీ డెవలప్మెంట్ ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని అన్నారు. విద్య, ఆరోగ్యం, గ్రామ పరిశుభ్రత, మహిళా సాధికారత, సహజ వ్యవసాయం, కమ్యూనిటీ ప్లాంటేషన్, అదానీ కృష్ణపట్నం పోర్ట్ లిమిటెడ్ పరిసర గ్రామాలలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఓఓ రాజన్ బాబు, ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్, గణేష్ శర్మ, జి. వేణుగోపాల్, ముత్యం జయరామ్, వెంకటేష్, భాస్కరన్, రమేష్ బాబు, జె. శ్రీనివాసులు, సిరియాల సత్యనారాయణ, సరళ, ఉమా పౌండేషన్ ప్రతినిధులు, పోర్ట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాతృత్వం చాటుకున్న పికెపాడు యువత



**అనంతసాగరం, ఆగస్ట్10, ప్రభాతవార్త :** మండలంలోని పడమటి కంభంపాడు గ్రామంలో కొరివి తిరుపాలు తండ్రి నరసయ్య శుక్రవారం అకాల మరణం చెందాడు. నరసయ్య దహన సంస్కారాలకు గాను గ్రామానికి చెందిన యువత కత్తిచిన్నయ్య, ఎస్. మల్లేష్, ఉదయగిరి నర్సింహులు, మెల్లంకొండయ్య, ఈశ్వరయ్య, కత్తి సురేష్, కత్తిపెంచలయ్య, రాయుడు లు 17వేల రూపాయలను గ్రామ పెదల సమక్షంలో అందజేశారు. ఈసందర్భంగా యువత మాట్లాడుతూ తిరుపాలు కుటుంబానికి తాము అండగా ఉంటామన్నారు.

## ఉద్యానవన పంటలపై శిక్షణా తరగతులు



**అనంతసాగరం, ఆగస్ట్10, ప్రభాతవార్త :** మండలంలోని అనంతసాగరం, గౌరవరం రైతు భరోసా కేంద్రాల్లో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో శాస్త్రవేత్త నారాయణస్వామి రైతులకు మిర్చి, బొప్పాయి, నిమ్మ పంటల్లో వేరు కుళ్ళు తెగులు, వైరస్, రసం పీల్చే పురుగుల నివారణకు చర్యలు తెలిపారు. మిరి , బొప్పాయి పంటల్లో రసం పీల్చే పురుగులు నివారణకు పసుపు, తెలుపు, బులుగు రంగు అట్టలు ఎకరాకి 30 పెట్టాలని, వేరు కుళ్ళు తెగులుకు ట్రైకోడెర్మాజీవన ఎరువులు వాడాలన్నారు. నిమ్మలో పూత యాజమాన్యం కొరకు జులైలో జిబ్బర్లిక్ యాసిడ్ 50 పిపిఎం1గ్రాము 20లీటర్ల నీటికి , సెప్టెంబర్‌మాసంలో సైకోసీల్ 1000 పిపిఎం 1మి.లీ, 1లీటర్ నీటికి , అక్టోబర్‌లో పొటాషియం నైట్రేట్ 10గ్రాములు లీటర్ నీటికి స్ప్రే చేయాలన్నారు. మండల ఉద్యానవన అధికారి రాజశేఖర్, ఉఖ్యానవన శాఖకుసంబంధించిన పథకాలు రాయితీలు వివరించారు. డ్రిప్, స్పిన్కర్ల పథకం రాయితీలు తెలిపి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అనంతసాగరం, గ్రామ వ్యవసాయ సహాయకులు వి.యశోద, గ్రామ ఉద్యానవన సహాయకులు మైమున్నీసా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వేమిరెడ్డి దంపతులను కలిసిన పోలంరెడ్డి దినేష్ రెడ్డి



**నెల్లూరు రూరల్, ఆగస్టు 10, ప్రభాతవార్త** నెల్లూరు పార్లమెంటు సభ్యులు ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులను తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం మాగుంట లేఅవుట్‌లోని విపిఆర్ నివాసానికి చేరుకున్న దినేష్ రెడ్డి వేమిరెడ్డి దంపతులను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతానికి సంబంధించి వారితో చర్చించారు. ఆయనతో పాటు రాష్ట్ర టిడిపి కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.

## మర్రిపాడు ఎంపిడిఒ గా పి.నాగమణి

**మర్రిపాడు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** మండల పరిషత్ అభివృద్ధి అధికారిణిగా పరిమి నాగమణిని నియమిస్తూ జిల్లాపరిషత్ సిఇఒ కె.కన్నమనాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 శాసనసభ , పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడిఒ నాగమణిని ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. ఈమె స్థానంలో వైఎస్ఆర్ జిల్లా నుంచి ఎం.మనోహర్‌రాజును మర్రిపాడు ఎంపిడిఒ గా నియమించారు. ఎన్నికల సమయంలో మనోహర్‌రాజు విధినిర్వహణలో చురుగ్గా పనిచేసి మంచి అధికారిగా గుర్తింపు పొందారు మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయాన్ని కూడా రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. కార్యాలయానికి వచ్చే బాధితుల పట్ల సత్వరమే స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. నాగమణి తిరిగి మర్రిపాడు ఎంపిడిఒ గా రావడంతో ఇంతవరకు పనిచేస్తున్న మనోహర్‌రాజు తిరిగి వైఎస్ఆర్ జిల్లాకు వెళ్ళనున్నారు.

## ఆత్మకూరు ఎంపిడిఒగా ఐజాక్‌ప్రవీణ్

**ఆత్మకూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.ఐజాక్‌ప్రవీణ్ శనివారం నియమితులయ్యారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఐజాక్‌ప్రవీణ్‌ను జనవరి నెలలో చిత్తూరు జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో చిత్తూరు జిల్లా నుండి బాలాజీ నాయక్‌ను ఆత్మకూరు ఎంపిడిఒ నియమించారు. తిరిగి పి.ఐజాక్‌ప్రవీణ్‌ను ఆత్మకూరు ఎంపిడిఒ గా నియమిస్తు జడ్పీ సిఇఒ కన్నమనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆత్మకూరు ట్రాఫిక్‌ను త్వరలో క్రమబద్ధీకరిస్తాం



**ఆత్మకూరు, ఆగస్ట్10, ప్రభాతవార్త :** పట్టణంలోని ట్రాఫిక్‌ను త్వరలోనే క్రమబద్ధీకరిస్తామని ఆత్మకూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ జి.గంగాధర్ పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాలను , నెల్లూరుపాళెం జాతీయ రహదారిని ఆయన శనివారం స్థానిక ఎస్ఐముత్యాలరావుతో కలసి పరిశీలించారు. మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో రోజు రోజుకు ట్రాఫిక్ పెరిగిపోతున్న దృష్ట్యా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే నెల్లూరు–ముంబాయి జాతీయ రహదారి నుంచి ఆత్మకూరు ఎంజిఆర్ బస్టాండు వరకు ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఏఏ ప్రాంతాల్లో ఏవిధంగా పట్టణంలోని వాహనాల రద్దీని నియంత్రించి క్రమబద్ధమైన ట్రాఫిక్ ప్రక్రియను చేపట్టేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. పట్టణంలోని ట్రాఫిక్ వలన ప్రజలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. రానున్న రోజుల్లో పట్టణంలోని అన్ని ప్రాంతాలను సమగ్రంగా పరిశీలించి ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వతమైన క్రమపద్ధతిలో ట్రాఫిక్ ప్రక్రియను చేపడతామన్నారు. ట్రాఫిక్‌నియంత్రణలో తీసుకోనున్న క్రమబద్ధీకరణ చర్యలకుపట్టణ వాహనదారులు, ప్రజలు తమకుసహకరించాలని సిఐ కోరారు.

## జడ్పి సమావేశంలో గళం ఎత్తిన కో ఆప్షన్ సభ్యుడు గాజుల తాజుద్దీన్



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త** జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్ మాట్లాడుతూ ఉదయగిరి ప్రభుత్వ హాస్పిటల్‌లో డయాలసీస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఉదయగిరి మండలంలోని గండిపాలెంలోని ప్రాథమిక పాఠశాలకు బిల్డింగ్స్ మంజూరు చేయాలని, జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సరైన సమావేశంలో జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యులు షేక్ గాజుల తాజుద్దీన్ కోరారు.

## జిల్లా వ్యాప్తంగా ఎంపిడిఓలు నియామకం

**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త** జిల్లా వ్యాప్తంగా 25 మంది ఎంపిడిఓలను జిల్లాలోని మండలాలకు పోస్టింగ్ జారీ చేస్తూ జడ్పి సిఈవో కన్నమనాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికలు నిమ్తిం, రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు బదిలీలపై వెళ్లినవారు తిరుగు జిల్లాకి ప్రభుత్వం బదిలీ చేసిందని జిల్లాలో 25 మంది ఎంపిడిఓలను జిల్లాల్లో పోస్టింగ్ జారీ చేశారు.

## జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా కే. కార్తీక్ నియామకం



**నెల్లూరు అర్బన్, ఆగస్టు 10, ప్రభాతవార్త** జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కె. కార్తీక్ నియామకమయ్యారు. విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా పని చేస్తూ నెల్లూరు జిల్లా జేసిగా బదిలీ పై రానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 మంది ఐఏఎస్ అధికారులు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న కార్తీక్‌ను నెల్లూరు జిల్లా జెసిగా నియమించారు. ఇక్కడ జేసిగా పనిచేస్తున్న సేతు మాధవన్ ఇటీవల పార్వతీపురం ఐటిడిఏ ప్రాజెక్టు అధికారిగా బదిలీ చేయగా ఇన్చార్జి చేసిన నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ వ్యవహరిస్తున్నారు. నూతన జాయింట్ కలెక్టర్‌గా కార్తీక్ సోమవారం బాధ్యతలు తీసుకోనున్నారు.